# చచ్చేమి సాదిస్తాం?

ఎవుడైనా నేను చస్తే! నేను చస్తా గానీ నాకత ఈళ్లకు అర్తం గాదు. అని ఎచ్చులు పలకతావుంటే నిజింగా నాకు నవ్వొస్తింది. ఎందుకంటే చచ్చేదంటే అంత లేసయిన పనిగాదని అన్నోడికీ తెల్సు. ఇన్నోడికీ తెల్సు. 'చస్తా! చస్తా!' అని బెదిరించే వాడెవుడూ చచ్చిందీ లే. చావాలనుకున్నోడు ఒకడితో చెప్పిందీ లే. తీరిపొయ్‌నోడు తీరుమానం చేసుకున్నోడు పట్టుకుణ్ణా నిలవరు. వాళ్లదోవన వాళ్లు పోతానే ఉంటారు.

అందుకే పెద్దోళ్లు ''తీపి కెల్ల తీపి తెలియంగ ప్రాణంబు!'' అన్నారు.

ఇంకొకరి దాకా ఎందుగ్గానీ నామటుకు నేను గూడా అంతే! కొంపలో మా బాశాలికి కోపెక్కినప్పుడు నాకు ఓపికలేకుండా పొయ్‌నప్పుడు తొలీతగా నానోట్లో వచ్చే మాట అదే.

''నేను చావాల. ఆ మిందట నీ కత తెలవాల!'' అని. సత్తింగా ఈమాట యిప్పటికి సవాలచ్చ సార్లయినా అనుంటా. నేను అనిన మాటగానా నేను నిలబెట్టుకోనుంటే నా కత ఎప్పుడో ముగిసి పొయ్యుండాల. ఆపె కత యిప్పటికే తేలి పొయ్యుండాల!

చస్తానంటే చచ్చేది లేదని ఆపెకు నాకూ కూడా తెల్సు!

ఆ మాత్రమన్నా బెదిరించకుండాపోతే సాగదని నాకూ తెల్సు!!

అయినా చేసేది సంసారంగదా? ఏందో ఒక సాకు పెట్టి ఆమె సతాయించకుండా ఉండేదీ లే. నాకు రగలకుండా పొయ్యేదీ లే. నాకు గానా రేగిందంటే యిక్కనపక్కన వాళ్లూ యీళ్లూ యింటా ఉండారని గూడా ఎంచేదేలే.

''నేను చస్తానే. నేను చావాల. నువ్వుపొయ్ యీదిలో పడాల. పడ్తే అప్పుడు తెలిస్తింది బతుకంటే ఏందో? నేనొకడు అడ్డంవుండి అన్నీ ఎత్తి నెత్తినేసుకోని ఏగులాడ్తా ఉంటే నీకేం తెలిస్తిందే? చచ్చేమి సాదిస్తానో దాంతో నాకేం పన్లే. నిన్ను సాదిస్తే చాల్నే. సాదిస్తా సాదిస్తా చచ్చి నిన్ను సాదిస్తా!'' అంటా సిటపట కాయి మాదిర్తో ఎగిరెగిరి పడ్తే ఆపె నోరు మూత పడ్తింది.

పొద్దు వాలిపోతా ఉండాది. చేసిందేమని ఎనిక్కి తిరిగి చూసుకుంటే ఏమీ కనపళ్లా? ముందుకు చూస్తే చెయ్యాల్సింది చెప్పలేనంతగా ఉండాది. ఉర్దాగా గడ్సిపొయ్‌న కాలాన్ని

తల్సుకుంటా ఉంటే ఎందుకులే యాదన. ఒగిటే యాదన. ఏం చెయ్యాల్రా నాసామీ! అని నా ఏడుపు నాదిగా ఉంటే గొడ్డోడు గొడ్డుకేడస్తా ఉంటే కొవ్వోడు కొవ్వు కేడ్సినట్టు మాబాశాలి–

''నీ ఏడుపు నీదేనా? కొంపలో ఏడుపు ఏమన్నా పట్టించుకుండేది ఉండాదా? లేదా?'' అని లగుసుకుంటింది.

అట్టగాదు. ఇట్నే అని ఎంత బతిమాల్నా యినకుండా బిగుసు కుంటింది. దాంతో కత మల్లా మొదటికొస్తుంది. కతట్టగాన మొదుటి కొచ్చేదంటే అదే ''నేను చస్తా! చస్తా!'' అని అంటే ఆపె అదెట్నో నేనూ చూస్తా చూస్తానంటింది.

ఆ యిదంగా కత మొదటి కొచ్చిన ఒకానొక నాడు నాకు నిజింగానే చావాలన్నెంత కోపం వచ్చె. ఆరు నూరు గానీ నూరారుగానీ యింక మిందట కొంపలో అడుగుపెట్ట పొయ్యేది లే. ఇంక ఈ బూమ్మీద తిరగ పొయ్యేది లే. అని తీరుమానం చేసుకుణ్ణా. ఈదిన పణ్ణా. కాళ్లెట్టా పోతావుంటే అట్ట పోతా వుండా. కాళ్ల దోవ కాళ్లదిగా ఉంటే మణుసు దోవ మణుసుదిగా ఉండాది. అది నేరుగా మిద్దార్లో మా సుద్ధ మిద్దె కాడికి పొయ.

నా చిన్నప్పుడు మా పెద్దన్న గూడా యిట్నే యిల్లు ఎలబారి పొయ్‌నాడు.

ఆయన ఎందుకు ఎలబారి పొయ్‌నాడని తెల్సుకోవాలంటే ముందుగా మా యింటి కత గూడా కొంచిమన్నా యివరంగా తెల్సుకోవాల.

పెద్దన్న రామన్న అని నాకు యిద్దురు అన్నలు.

రేత్రింబొగుళ్లు మా రామన్న వొళ్లొంచి సేద్దిం నాద్దిం చేసుకుంటే ఏందో పొల్లించుకోని వచ్చేవాడి మాదిర పెద్దన్న పై పైన్నే తిరిగేవాడు.

అయినా మాయమ్మకు పెద్ద కొడుకంటేనే పాణం!

ఇంత కంతకూ మా యిద్దురి మింద యిర్సక పణ్ణా మాయమ్మ పెద్ద కొడుకును మాత్రం పొల్లెత్తు మాట అనేది లే. ఇట్టా మాదిర వలపచ్చిం అంటే మాఅయ్యకు పడేది లే.

''పెద్దోడికి అంతా నీ సాలే. అందుకే అస్తమానం వాణ్ణి ఎనకేసుకోని వస్తావుండావ్. రాముడు వాడొక మోటుగాడు. కాబట్టి సరిపొయ. లేకుండా పొయ్యుంటే యియ్యరవకే తెల్లారి పొయ్యుండు. వొంగే కుందికీ తోలుకోని తిరిగేది జాస్తయితే ఎట్నే?''– అంటా మాఅయ్య అడపా దడపా గూటించినా మాయమ్మకు చీమ కుట్నెట్టు గూడా ఉండేది లే.

మా పెద్దన్నకు మాయమ్మ సాలు వచ్చిందంటే ఆయన గూడా యాపారం చేసేటోడు. అది గూడా సీజనల్ యాపారం. శెనిక్కాయిల కాలం వస్తే శెనిక్కాయిలు పట్టాడు. బండ్లకు బండ్లు కలవ కుంటకు తోల్తాడు. బెల్లం సీజన్‌లో బెల్లం లారీల మింద లారీలు వేలూరికి తోల్తాడు. మరీ మామిడి కాయిల సీజన్ వస్తే తోటలకు తోట్లే యిజారా ఎత్తి మదరాసులోనే మకాం పెట్టాడు.

''వాళ్లకే మబ్బా? ఒక కొడుకు మూడు బావల కింద సేద్దిం వొంటి చేతి మింద

చేసుకోని పోతావుంటే యింకొక కొడుకు యాపారం మింద పాల్గించేస్తా ఉండాడు. బిడ్డలు పుట్టే అట్టుండాల. పెట్టి పుట్నోళ్లు. చేసుకున్నోళ్లకు చేసుకున్నెంత!''- అని మా ఊళ్లో వాళ్లా యాళ్లా అంటా వుంటే మాయమ్మ కల్లా చూడాల. ఊరి ముందర గుంటలో పూసిన దామర పూలన్నీ ఆ మొకం లోనే చూసుకోవచ్చు!

అటుమంటి కొడుక్కి ఆ తల్లికి ఒక సారి పడింది. ఎట్టా పడిందంటే అట్టా యిట్టాగాదు. చెటా పటా పడింది. ఎందుకు పడిందంటే? -

''ఈ సమ్మత్సరం మామిడి తోటల జోలికి పోవద్దురా!'' అని మాయమ్మ నెత్తిన నోరు పెట్టుకోని మొత్తుకుంటే అతగాడు యినకుండా వద్దన్న పని కద్దని చేసినాడు. ''ఇంకొక పది యిర్వై దినాల్లో కాపుదించు కోవచ్చు!'' అని అనుకుంటా ఉంటే గాలీ వానా మాత్తారంగా వచ్చె. కాపు సీదా రాలి పాయ. పెట్టిన దుడ్లు సగానికి సగం గూడా రావనే కుందికి మాయమ్మ కడుపు అట్నే రగిలె. ఎందుకు రగల్దు? ఎటుమంటి యిక్లామార్కుడి బుద్దయినా దుడ్ల కాణ్ణేగదా తెల్సేది? అటుమంటప్పుడు దమ్మిడి దమ్మిడిగా ముడేసి పెట్నె మాయమ్మ కత చెప్పాల్నా? చెడా బడా నాలుగు అర్సేకుందికి మా పెద్దన్న ఎప్పుడూ మాట పణ్ణోడు గదా? 'ఇంక నీ మొకం చూసేదిలే. యాడన్నా పాయ్ ఛస్తాను చూడు.' అంటా యిల్లు ఎలబారి పాయ.

''ఇట్టా మాదిర బెదిరించినోళ్లు శానా మంది ఉండార్లేరా? అనే వాళ్లంతా అన్నె ప్రకారం చచ్చేటిగా వుంటే యింకేమి వుండాది. ఆడా యీడా తిరుక్కోని కూలు కూదిర్తే నువ్వే వస్తావులేరా?'' అని మాయమ్మ మాత్రం శానా బింకంగా ఉండె.

రొండు దినాలాయ. మూడు దినాలాయ. అనుకుంటా ఉండంగానే వారం దినాలు గడ్సి పాయ. మా పెద్దన్న పోవిడే లేకుండాపాయ.

ఇంక చూస్కో నా సామిరంగా! మాయమ్మను పట్టే దానికే కాలా. గుంటలో దూకతా నంటింది. బాయిలో దూకతానంటా పరిగెత్తి పోతింది. కొడుకును చూడకుండా ఒక్క సెణం బతక లేనంటింది. ఎతికే దానికి మణసల పంపించ మంటింది. ఈన్నె గొడ్డు మాదిర ఆయారాటం పారాటం చూల్లేకుండా మాలయ్య 'శాస్త్రం చూపించి రాబోరా!' అని నన్ను ఎగదోలె.

సరే! నేను గుంట కట్టమింద దిగబడి పాయ్యే బస్సెక్కితి. పుత్తూరికి పాయ్ దిగితి. దిగతానే నేరుగా శాస్త్రం చెప్పే రాజు యింటికి పోతి.

నాయినా! తండ్రీ! అప్పిటికే ఆడ చూడబోతే కొళ్ల బొయ్‌నంత మంది కూలబడి ఉండారు. ఎవుడి చేతిలో చూడు ఆకులూ వక్కలు టెంకాయి. అందురు శాస్త్రానికని వచ్చిన వాళ్లే. ఆడ ఉన్నోడు లేనోడు మణిసి లావు లంబు యివ్వేందీ పాడ్సేది లే. ముందొచ్చినోడు ముందే. ఎనకొచ్చినోడు ఎనకే. తెల్లార్తో వచ్చినోణ్ణి. అట్టా యిట్టా కదలకుండా అణ్ణే కాపెట్టుకోనుంటే ఎప్పుడో పొద్దు తిరిగే యాళకాడ నా వంతు వొచ్చె. చేతిలో వుండే వక్కాకులో దచ్చిన పెట్టి దాని మింద టెంకాయ పెట్టి ఆయన ముందర పెట్టి. మడి చేతులు

కట్టుకోని బగితిగా కూసుంటి. రాజు వాటన్నిట్నీ లెక్క పెట్టె. ఆహా! ఊహూ! అని మూలగతా పలకమింద బలపంతో పొటుకేస్తా రోంచేపు తేల కండ్లేసి ఎనిక్కి ముందిరికి ఊగె. ఆ మిందట పలక మింద ఏందో రాసె. ఆ పలకను బోళించి పెటేసె. అప్పుడు నా కల్లా చూసి-

''మీ పెద్దన్న యాడుండ్రా అబ్బోడా?'' అని అడిగె.

నేనెందుకు చెప్తా? జంకూ కొంకూ రొండూ లేకుండా యింటి కాణ్ణే ఉండాడని చెప్తి.

''ఎద్దు కాళ్లో ముల్లంత లేవు. అప్పుడే అపద్దాలు చెప్పేదానికి తయ్యారైతే ఎట్రా?'' అంటా పలకెత్తి తిప్పించి చూపించె. పలక మింద పరార్ అని రాసి పెట్టుండాది.

నేను గుమ్మయి పోతి!

''ఆలగోడు బాలగోడు చేస్తా వుండాది గదా మీయమ్మ. తిట్టి తరిమేసిందీ మీయమ్మే. ఇప్పుడు చూడకుండా బతకలేనంటా ఏడ్సేదీ మీయమ్మే. ఇట్టయితే ఎట్రా? పో! పాయ్ మీ యమ్మతో చెప్పు. నీ కొడుకు లచ్చినంగా ఉండాడు. నెత్తిన రాయేసినా వాడికి చావులే. ఇంటికి రాకుండా పొయ్యేదిలే. వస్తే మూడు గెంటల్లో... లేకుండా పోతే మూడు దినాల్లో... మూడు వారాల్లో మించ కుండా వస్తాడు. అని చెప్పు. యింక లెయ్.'' అంటా తొందర చేసె.

నేను యింకేదో అడగదా మనుకుంటా ఉండా!

''అదంతే! ఆడికై పాయ నీ కత. జరుగు జరుగు. పక్కకు జరుగు. నువ్వుండే తావన దూడను కట్టేయాల!'' అంటా పక పక నవ్వె.

నేను పక్కకు జరిగే కుందికి యింకొక డొచ్చి ఆడ కూసుండె! ఆయన పని మేలుగా ఉండాది. కూసుణ్ణె చోటు కదలకుండా సంపాయించు కుంటా ఉండాడు. బతికే దానికి బగమంతుడు ఏందో ఒక విద్దె ప్రెతోడికి యిచ్చేటట్టుగా ఉండాది. అనుకుంటా బస్సెక్కితి. గుంట కట్టమింద దిగితి. ఇల్లు చేర్తి. సరే మా పెద్దన్న గూడా ఎప్పుడో ఒకప్పుడు కొంప చేర్నాడనుకోండి!

ఇదెంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే చస్తా చస్తా! అని బెదిరించే వాడెవుడూ నిజింగా చచ్చేది లేదని చెప్పేదానికే! ఇది తెల్సిగూడా మల్లా నేను మా బాశాల్తో నేను చస్తా. చచ్చి నిన్ను సాదిస్తా! అని యిల్లు ఎలబారి వచ్చినానంటే నవ్వులాటగా ఉండాది గదా?

చచ్చి సాదించేది లేదని తెల్సి గూడా మణిసి చస్తా ననేది ఎర్రి తనం.

అట్టయితే చచ్చి సాదించినోళ్లు లేరా? అంటే-

ఉండారు. వాళ్లు మహన్నబావులు! ఎవురబ్బా ఆ మహన్నబావులంటే?

ఇంకెవురు? పొట్టి శీరాములు!

ఆ మహన్నబావుడు చచ్చి ఏమి సాదించినాడంటే మన రాష్ట్రాన్ని మనకు సాదించి

పెట్నాడు. ఒక దినమా? రొండు దినాలా? యాభై తొమ్మిది దినాలు తిండీ తిప్పలు లేకుండా పడుండె. ఒక్క దినం అంత తిండి లేకుండా పోతే- తిండి దాకా ఎందుకులే? కడాన కాపి లేకుండా పోతే యిలయిల్లాడి పోతాం. అటుమంటిది మహన్నబావుడు ఒక్క దినం తక్కవగా రొండు నెలలు పస్తుపడి పరలోకానికి పాయ. మనకేమో ఆంధ్ర ప్రెతేక రాష్ట్రం వచ్చె.

ఈ మాట మణుసులో మెదిలేకుందికి నా ఆలోచన నిరాహార దీచ్చల మిందికి మల్లె.. అపొద్దు మహన్నబావులు నిరాహార దీచ్చలు చేసినారు.

ఈ పొద్దా మొనగోళ్ల నిరాహార దీచ్చలు చేస్తా ఉండారు.

ఒక దానికి యింకొక దానికే మన్నా సంబంధం ఉండాదా? నిరాహార దీచ్చలంటేనే అర్తం పర్తం కూడా లేకుండా పాయనే!

మహాత్ముడు నిరాహారదీచ్చ చేసినాడంటే దేశిం కోసరం చేసె. అట్నే పొట్టి శీరాములు చేసినాడంటే ఒక జాతి కోసరం చేసె. మర్రి యిప్పుడా? ఆ అంటే నిరాహార దీచ్చ. ఊ అంటే నిరాహార దీచ్చ. ఈళ్లంతా ఎందుకు చేస్తా ఉణ్ణెట్టు? -

పార్టీ వాళ్ల ఎక్స్ పార్టీ వాళ్లను కొత్తే నిరాహార దీచ్చ. వాళ్ల మింద కేసు పెత్తే నిరాహార దీచ్చ. జీతాలు పెంచాలంటే నిరాహారదీచ్చ. బోనస్ రాలేదంటే నిరాహార దీచ్చ. పని చెయ్యమంటే నిరాహార దీచ్చ. వద్దంటే నిరాహార దీచ్చ. అయినోడికి అతికారం పోతే నిరాహార దీచ్చ. కానోడికి ప్రమోషన్ వస్తే నిరాహారదీచ్చ. ఉద్యోగాలకు నిరాహార దీచ్చ. ఊడిపోతే నిరాహార దీచ్చ- మాట ఎత్తితే చాలు. గుడ్డల్తో ఒక గుడిసె ఏసుకుండేది. జమ్మని మెళ్లో పూలదండలు ఏసుకుండేది. కూసుండేది. పోటోలు తీయించు కుండేది. పేపర్లో ఎయ్యపించు కుండేది!

నా చిన్నప్పుడు మా యమ్మ బెల్లం శెనిక్కాయిలు పెట్నంటే నేను అన్నం తిన్నని అలిగి కూసుణ్ణెట్టుండాది ఈళ్లు చేస్తా ఉండే నిరాహార దీచ్చలు! నిరాహార దీచ్చలంటే సుద్దంగా మతింపులేని యాపారమయి పాయ్‌నే? అని ఆలోచించుకుంటా పోతావుంటే బుజం మింద చెయ్యి పడె!

తిరిగి చూస్తే ముత్తారెడ్డన్న!

''ఇదేందిది? ఈ పుణ్ణాత్ముడు యిక్కడెందుకు తేల్నాడో? అనుకుంటా చూస్తే కడాన నేను తేలిందెక్కడ? తల చుట్టి నోటి కాడి కొచ్చి నట్టుగా ఆ నాలుగ్గాళ్లమండపం కాణ్ణే! చావాల? చచ్చి సాదించాల అనుకుంటా ఎలబారిందేంది? నేనుండే తావేంది?'' అని అనుకుండే కుందికి నిజింగా నాతల కొట్టేసి నట్లయిపాయ!

''ఒరే అబ్బారే! అద్దో అట్ట చూడు. ఆ గ్రామ చావిడి ముందర నిరాహారదీచ్చా శిబిరం. ఆడ కూసోనుండే వాళ్లకు నీకూ ఏమీ వెత్తాసం లే. మీ బోటోళ్లు చచ్చేది లే. సాదించేది లే. చచ్చి సాదించే వాళ్లు మహన్నబావులు. నువ్వు పదరా!'' అనె.

చచ్చినా యింక చస్తాననేమాట నోట్లో రాగూడదను కుంటి. చూడాల మల్లా! ●